కథానిక

# ప్రశ్నించిన సానుభూతి

వి. ఎస్. కళ్యాణి

చేతులు శిరస్సుపై జోడించి తపస్సమాధిలో నిలిచివున్న ఋషిపుంగవుడిలా నిశ్చలంగా ప్రకాశిస్తోంది ప్రమిదలో దీపం...

దీపంచుట్టూ దేనికోసమో పల్టీలు కొడుతోంది ఓ తెలివిమాలిన పతంగం ..

"దీపక్ పర్ నాచ్ పతంగా" ఏదో అవ్యక్త రాగం ఏ నిశాకోశ సీమల్నించో...

మరెక్కడనుండీ కాదు! తనలోనుంచే ... లలిత బాధగా ఆవులించింది. కళ్లు బరువుగా వున్నాయి. కాని నిద్రరాదు. కూతురూ భర్తా ప్రశాంతంగా నిద్రపోతున్నారు. లలితకి అనూయ కూడా కలుగుతోంది, తనకే నిద్రరాదు. దీపం మీద పురుగు రెపరెపలాడింది.

"దీపక్ సంగ్ నాచ్ పతంగా" నృత్యం చేస్తోందా? సంతోషాన్ని ప్రతిధ్వనించే నృత్యం విషాదాంతం కాబోతుందని పాపం! ఈ బుల్లి ప్రాణానికేం తెలుసు? సృష్టిలో మహోత్కృష్టుడైన మానవుడికే తెలియదు తాను చేసేపనుల ఫలితం. నిజంగా జరగబోయేది అద్దంలోలా చూసి అనుభవించ గలిగితే ఎంత బాగుంటుంది.

పతంగం ప్రమిద అంచుమీద క్షణకాలం నిశ్చలంగా నిల్చింది. తపస్సమాధిలోవున్న యోగిలావుంది! లలిత విషాదంగా నవ్వుకుంది.

అబ్బా! అనుకుంటూ వాలు కుర్చీకి మేను చేరవేసింది లలిత. ఆమె హృదయాంతరాళంలో ఏదో వేదనాగ్ని పొగలు రాజుకుంటోంది.

నిశ్చల నిశీథంలో...సర్వలోకాలూ మోహ వివశమై అచేతనావస్థలో కష్టసుఖాల్నించి దూర దూరాలకి తరలిపోయిన సమయంలో తనూ... తనతోడు ఈ రెక్కలపురుగూ వీరి హృదయాలు కొట్టుకుంటున్నాయి, కళవళ పడుతున్నాయి. మూగగా రోదిస్తున్నాయి. ఈ మూగ వేదనల పొరల మరుగుల్లో విరిగిపోయిన రహస్యాలెన్నో?

"ఏమే చిందులాట మాను! ఓ తెలివిమాలిన పురుగూ! అఖండజ్యోతికిఆహారంఅవుతావుసుమా!"

నువ్వనుకుంటున్నది పచ్చి మోసం...దగా!

లలిత పెదవులు ఆశగా కదిలించింది. నిరాశ విరిచింది. లలిత మూగభాష రెక్కల జీవానికి అర్థమే కాకో మరి ఏ మాటకి విలువిచ్చేదెవరనో ఖుషీగా కొట్టింది మరో మూడు పల్టీలు!...

ఎదురింటి ప్రేమజంట, వయసుజంట, చక్కని జంట ముచ్చటగా మూడు విశేషణాలూ కలిసిన ముద్దుజంట జంటపుష్పాల్లా గాలిలో ఎగిరి స్వప్న సౌధాంచలవీథుల్లో చట్టాపట్టావేసి విహరిస్తూండవచ్చు!... ఆ సుఖం, ఆ సంతృప్తి, ఆ ఆనందం, తను నోచుకోలేదు! పక్కమీద భర్తవదనంలో ప్రశాంతత ఇనుమడించింది. ముఖంమీద ముడతలు స్ఫుటంగా కనిపిస్తున్నాయ్. ఈ ముడతల్లో తన జీవిత రహస్యాలు దాగివున్నాయ్. లలితకి గట్టిగా మూలగాలనిపిస్తోంది... ఎలుగెత్తి ఏడ్వాలనిపిస్తోంది. ఏడవటానికి మూలగటానికికూడా కంఠనాళంలో ఆవరోధాలడ్డగిస్తున్నాయ్.

చుట్టూవున్న మురికిబావాలనుండి దూరంగా ఎక్కడికో ఎగిరిపోవాలనుకుంది. కాని తనని బంధించిన శృంఖలాలనెలా విఛ్ఛిన్నం చేయడం?

ఈ పాపిష్టి మనస్సుకి బేడీలు పడవేం?

దీపంపురుగు ఒడుపుగా వేసింది మరోకపల్టీ.

ఎదురింటి వయసుజంట వయ్యారంగా మూసిన కనులలో సవ్వడిలేకుండా తెరుచుకున్న స్వప్న కవాటాలు! అచేతనమైవున్న భర్త ఫాలభాగం మీద వయోధిక్యత ఒడుపుగా వేసిన ముద్రలు!

ఏదోనీడ...నీడలో అస్పష్టమైన ఆకారం... నీడ తనవైపు పెదవులు కదిలించింది... తనలో ఉదధులు ఘోషించాయి.

"నాన్నా! నీ జీవితానికి పీడకలనై జన్మించాను నాన్నా! తత్ఫలితంగా నన్ను నేనే శిక్షించుకుంటున్నాను నాన్నా!" లలిత పెదవులు కంపించాయి.

"నీ సుఖంకోసం ఆశించాను. నాసర్వస్వాన్నీ నీ సంతోషానికి వెచ్చించాలనుకున్నాను. తల్లీ! ఏం చేశావ్! మిగిలింది ఎల్లకాలం వెన్నువిడవని నీడలై పోయాయా?" అస్పష్టరూపంలో ప్రకంపిత అధరాలు అవ్యక్తంగా ఏదో ధ్వనించాయి. లలిత మానాశ్రువులప్రవాహంలో కరిగి నీరై ఏరై ప్రవహించింది.

బ్రతికినన్నాళ్ళూ నవ్వుతూ హింసించింది తండ్రిని. "కోరిన వరుడికిచ్చి పెళ్ళి చేస్తానమ్మా ఎన్నాళ్ళిలా వుంటావ్. ఆడపిల్ల ఎంత చదువుకుని స్వతంత్రురాలైనా ఒంటరిగా జీవించలేదు తల్లీ!" అని చెవినిల్లు కట్టుకుని పోరిన తండ్రి తన ఆశలు తనలోనే జీర్ణింపజేసుకుని పయనించాడు. మిగిలింది తనూ...

తన వెనక......
స్వయంకృతాపరాధాల నీడలు!......
స్వీయాపచారాల చీకటి దొంతరలు!!......

కాస్తలో తప్పిందికాని దీపంపురుగు భస్మం కావలసిందే!...తిరిగి అదేయాత్ర...ఏమిటీ దీని భ్రమల ఆంతర్యం? చెయ్యితో నెట్టింది ఆవలకి. ఒకటి కాదు. రెండు.. మూడుసార్లు. తిరిగి అవే పల్టీలు...అదే అజ్ఞానపరిభ్రమణం...

భర్తముఖంమీద ముడతలు మరీస్ఫుటంగా కనిపిస్తున్నాయ్. నలభైఅయిదుకి పైబడి వుండవచ్చు వయస్సు!... తనకి పాతికసంవత్సరాలు తిరిగాయో..లేదో...ఏరికోరి చేసుకున్న వరుడు!..

పెళ్ళి అప్పుడే అక్కర్లేదని తండ్రినిచంపి, ఆటుతర్వాత తన కలలు తీరా కాంచిన ప్రియతముడు!...తన అవివేకం కాని ఆయన్ని తనెందుకు ద్వేషించాలి?...తన దౌర్భాగ్యం తననే లొంగతీసింది!...

ఎదురింటి వయసుజంటు కష్టాలెరుగని కలల అంచుల్లో కనుమూసి వుండవచ్చు...వాళ్లు లోకం సునిశితదృష్టికి చిలకా గోరువంకలు!...

తనూ.. తనభర్తా.. ?!!...

అప్రయత్నంగా ముఖం అద్దంలో ప్రతిఫలించింది. తనముఖంలో నాలుగేళ్ళ నాటికీ ఈనాటికీ ఎంతమార్పు! వార్ధక్యం తనలోనూ మొగ్గలు తొడుగుతోంది!...లలిత కనుకొలకుల్లో రెండశ్రుకణికలు వికసించి విరిగిపోయాయి.

లలిత మనస్సు 'సినిమా' ప్రాజెక్ట్ చేసింది...

లోకం వసంత శోభాయమానంగా కనిపించే దినాలవి. ఇంత ఆనందంలోనూ మధ్యన విషాదలిప్తమైన తండ్రిముఖం!..లలితగుండె లవిసిపోయాయి. ఆనాడు "కేర్" చెయ్యలేదు. ఆనర్స్ పాసై స్వేచ్ఛా విహంగంమాదిరి, జీవితం సంతోష తరంగహస్తాలలో ఉయ్యాల లూగిన రోజులవి!

అక్కగారింటికి ఉద్యోగప్రయత్నంలో తను రావటమే ఘోరమైన క్షమించరాని నేరం.

ఉద్యోగం దొరికింది. తండ్రి అట్టే సంతోషించలేదు. కాని తనకు సంతోషమేగా...

జగన్నాథ్ కుటుంబం తండ్రిదగ్గర్నుంచీ తెలిసి వున్నది—తనను కార్లో తీసికెళ్ళి పట్నం అంతా తిప్పినచోట్లు చేసిన షికార్లు మాట్లాడిన మాటలు ఆనాడు ఆనందవనధుల్లో ముంచి తేలుస్తే—

ఈనాడు మనోవేదనని వృద్ధిచేస్తాయి!

అప్పట్లో తనలో పెళ్ళి చేసుకోవాలనే తలంపు అసలేలేదు. అందులోనూ అతన్ని......కేవలం విదుషీమణి కాబట్టి మగవారితో స్వేచ్ఛగా తిరగటం తన జన్మహక్కనిమాత్రం భావించింది.

అందుచేతే అక్కా బావా తన స్వతంత్రాన్ని అడ్డగిస్తే తను ఎదురు సవాల్ చేసింది.

తల్చుకుంటే శరీరం జలదరిస్తుందే!...హృదయము అలిసిపోతుందే!...తన శీలంమీద తనకుండే వల్లమాలిన నమ్మకమే తనచేత అంతపనిని చేయించిందా?... కాని...ఒకానొక దుర్ముహూర్తంలో ఈ సంబంధం విడవరాని బంధంగా రూపొందినప్పుడు రహస్యంగా తాను కార్చిన కన్నీళ్ళెన్ని? తిట్టుకున్న తిట్లెన్ని?...లోపల బాధని లోలోనే అణచుకుని పైకి రిజిస్టర్డ్ మేరేజీ ప్రకటించి తప్పుకాదన్నట్టుగా నవ్వుకొన్న నవ్వులెన్ని?

విద్యావంతులు తమ పొరబాట్లను తా మనుభవిస్తున్నా ఇతరులవద్ద అంగీకరించలేరు.

గత జలసేతుబంధనం శూన్యఫలితం అని తనకు తెలుసు. కాని హృదయంలో ఏవో అహ రహాలు ములుకులాఉండిఉండి గుచ్చుకుంటుందే?

భర్త తనని సరిగా చూడడం లేదనా?... కానేకాదు. కాకపోతే ఉద్యోగం చేస్తూంటే భరించలేకపోయాడు కాని!...

ఇక వయసువాడు కాదనా?...అది తన దుర దృష్టం. ఒకానొక దుర్ముహూర్తంలో తన దౌర్భాగ్యం పండిన ఫలితం...ఇంకా నైతికంగా పతనం కాకుండా ఆత్మవంచనకి ఇష్టం లేక మేల్కొని తాను చేసిన సత్కార్యం... మరి కాకపోతే తన దీర్ఘవిచారానికి కారణాలు ఇంతకన్నా బలవత్తరమైనవి!

అతనికి పెద్ద భార్యవుంది! రెండు సంవత్సరా లలో మేజర్ కాబోయే కొడుకు దగ్గర్నుంచీ పిల్లలున్నారు. లోకం దృష్టిలో తను న్యాయ సమ్మతమైన భార్యకాదు! వ్యక్తిగతమైన మనో వేదనతో తను అనుక్షణం మాడి మసిబొగ్గవుతూ వుంటే లోకానికి తనమీద ఆవగింజపాటి సాను భూతి లేదా?

"నీలిగి నీలిగికూర్చున్న పెద్దమ్మకికావలసిందే!"

"ముసలి నక్కకూడా మన్మధుడులా కనిపిం చాడు కాబోలు!"

"ఉన్నన్ని రోజులూ మహా హింసించిందా తండ్రిని!"

"చదువుకుని స్వేచ్ఛ కావాలందికదూ! రహ స్యాలు దాగుతాయా? ముందుమాత్రం ఈవిడ పోకడలు ఆ ముసలాయనచూడొచ్చాడుకనకనా!"

"కారూగీరూ వుందని ఆశపడింది కాబోలు!"

స్వయంగా, పరోక్షంగా అనేకంవిన్నవీ,చెప్పు కొన్నవీ ఇవీ తనమీద రిమార్కులు. ఇవన్నీ తనకు తగిలించిన బిరుదులు!

ఒక అపచారాన్ని దాచటానికి మరో పది అబద్ధాలు తాను ఆడలేదు! మరి ఎందుకు లోకా నికి తనమీద కక్ష! ముడుతలుపడిన భర్తముఖం. వడిముడుకులులేని ఎదురింటి పయసుజంటా... నీడగా ప్రశ్నించే తండ్రీ, సుడితిరిగే హృదయ ముత్రో తనూ... ఈ నీడలబాటల్లో గడబిడగా సాగే తన జీవనపథం! అన్నిటిమధ్యా సడిచేస్తూ పట్టీలుకొట్టే పతంగం! ఇవీ తనను వెన్నంటే ప్రశ్నలగోడులు!

నిద్రలో మునిగినభర్త ఇటునించి అటు వత్తి గిలిన సమయంలో ఎదురింటి ప్రేమజంట పెద వులమీద సున్నితమైనహాసం విరిసిచే నిమిషంలో పసిపిల్ల కెవ్వుమంది-పీడకల కాబోలు. అజ్ఞానం పండిన దీపం పురుగుఅగ్నిశిఖలలో చిటపటమంది.

లలితకళ్లు దీపంవైపు తిరిగేయి. సానుభూతి సగంలోనే ఎందుకు? అన్న ప్రశ్నవచ్చి హఠా త్తుగా ఆగిపోయింది.ఎందుకా? లలితకేదో విద్యుత్ ఘాతం లాంటిది నరనరాలా విషంలా పాకింది. అజ్ఞానజీవం చేసిన అజ్ఞానపు పనికి సానుభూతి చూపలేని తను విజ్ఞానవంతురాలై చేసిన అజ్ఞానపు పనికి లోకంతనకి సానుభూతి చూపలేదంటుందా? లలిత పెదవులమీద సందేహాశ్చర్యాల ఫలితంగా మెరిసిన విషాద దరహాసంలో ఎండిపోయిన విషాదం తిరిగి చిగురులు తొడిగింది.

---

జాతీయ స్థయిర్యమునకు ప్రపంచవ్యవస్థకు కూడా నూతన జీవన విధానమొకటి మూలము కావాలి. అది అన్ని తరగతుల, అన్ని జాతుల, అన్ని దేశముల ప్రజల ప్రయోజనాలనూ కాపాడగలిగి వుండాలి. ఎవరైతే స్వార్థమనే అవిద్యాంధకారము నుండి తప్పించుకొని బయటపడ్డారో వారే ప్రపంచశాంతికోసం పాటుపడి దానిని స్థాపించగలవారు. ప్రపంచశాంతి అంటే మానవకోటియొక్క జీవితంలోనూ ప్రవర్తనలోనూ కొన్ని సార్వలౌకిక సిద్ధాంతాలూ, ఆదర్శాలూ రూపొందాల్చడమే. అందుకోసం నీతి వికృతంచేయని, మానవజీవితమును వినాశనము చేయని ఆయుధములద్వారా మనము పోరాడాలి. యీ ప్రయత్నంలో మనకెట్టి కష్టనష్టములు తటస్థించినా మనం ఓర్చుకోడానికి సంసిద్ధంగా వుండాలి.

—డాక్టర్ రాధాకృష్ణన్